సాక్షి

వికారాబాద్

సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024






## యంత్రాలు మొరాయించి!

వేసవికి ముందే నీటి కష్టాలు మొదలయ్యాయి. వచ్చే మూడు నెలలు ప్రజలకు నీటి తిప్పలు తప్పేలా లేదు. 8లో▸



## కల్యాణం.. కమనీయం

శేరిగడ్డతండాలో కాశీ విశ్వేశ్వర ఆలయంలో ఆదివారం స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. 8లో▸



## 'ప్రత్యేకత' కనిపించేనా!

గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. 9లో▸

# అమృత్ భారత్ స్టేషన్‌గా వికారాబాద్ జంక్షన్

**అభివృద్ధి పనులకు రూ.24.35కోట్ల నిధులు**

- నేడు వర్చువల్‌గా ప్రధాని మోదీ శంకుస్థాపన
- మారనున్న స్టేషన్ రూపురేఖలు
- ప్రయాణికుల సౌకర్యార్థం ఆధునికీకరణ పనులు



వికారాబాద్ రైల్వేస్టేషన్ నమూనా చిత్రం

**అనంతగిరి:** రాష్ట్రంలోని 15 రైల్వే స్టేషన్‌లు అమృత్ భారత్ స్టేషన్‌లుగా ఎంపికయ్యాయి. ఈ రైల్వే స్టేషన్‌ల ఆధునికీకరణకు సోమవారం భారత ప్రధాని నరేంద్రమోదీ అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను రైల్వే అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ రైల్వే శాఖ చేపట్టబోయే అమృత్ భారత్ స్టేషన్‌లలో భాగంగా రాష్ట్రంలోని 15 స్టేషన్లు రూ.230 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా వికారాబాద్ రైల్వే జంక్షన్ అభివృద్ధికి రూ.24.35 కోట్లు మంజూరయ్యాయి. ఈ అభివృద్ధి పనులతో స్టేషన్ రూపురేఖలే మారనున్నాయి. వికారాబాద్ జంక్షన్ నుంచి హైదరాబాద్, బీదర్–షిరిడి, వాడి వెళ్లే రైళ్లు ప్రయాణిస్తుంటాయి. ఈ రైల్వే స్టేషన్ నుంచి నిత్యం దాదాపు 12 నుంచి 15వేల మంది ప్రయాణిస్తుంటారు. జంక్షన్ మీదుగా నిత్యం దాదాపు 50 వరకు రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ స్టేషన్ ఎన్ఎస్‌జీ(నేషనల్ సబర్బన్ గ్రేడ్)–4లో ఉంది. జిల్లా కేంద్రంతో పాటు, జంక్షన్‌గా ఉండటం, నిత్యం ప్రయాణికుల రద్దీ ఉండటంతో రైల్వే అధికారులు ఈ స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్‌గా ఎంపిక చేశారు.

**అభివృద్ధిపనులు**

స్టేషన్‌లో ప్లాట్ ఫారం విస్తరణ, అత్యాధునిక వెయిటింగ్ లాంజ్, అన్ని విభాగాల అధికారుల కార్యాలయాల ప్రత్యేక విభాగాలు, వీఐపీ, జనరల్ పబ్లిక్ కోసం ఏసీ, నాన్ ఏసీ వెయిటింగ్ హాల్స్, అధునాతన మోడల్ పెయిడ్, నాన్ పెయిడ్ టాయిలెట్స్, మూడు ప్లాట్‌ఫారంలకు వెళ్లేందుకు అనుగునంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎక్స్‌లేటర్, లిఫ్ట్, స్టేషన్ ముఖద్వారం మార్పు, పార్కింగ్ విస్తరణ, పార్కు ఏర్పాటు తదితర పనులను దశలవారీగా పూర్తి చేయనున్నారు.

**నేడు శంకుస్థాపన**

ప్రధాని మోదీ సోమవారం ప్రారంభించే ఈ కార్యక్రమానికి రైల్వే ఉన్నతాధికారులతో పాటుగా అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీ రంజిత్ రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఇప్పటికే రైల్వే అధికారులు ప్రారంభోత్సవ ఏర్పాట్లను పూర్తి చేశారు.

# ఆస్థాలో అయోధ్యకూ..

- తాండూరు నుంచి సాలూపూర్‌కు ప్రత్యేక రైలు
- రామ భక్తులకు వీడ్కోలు పలికిన బీజేపీ నేతలు



ఆస్థా రైలు వద్ద స్థానిక బీజేపీ నాయకులు

**తాండూరు టౌన్:** తాండూరు నుంచి రామ భక్తులు అయోధ్యలోని భవ్య రామ మందిర దర్శనార్థం ఆదివారం ఆస్థా ప్రత్యేక రైలులో బయలుదేరారు. సాలాపూర్ వరకు వెళ్లనున్న ఈ ట్రైన్‌లో తాండూరు నుంచి 300 మంది భక్తులు బయలుదేరగా ఇతర ప్రాంతాల నుంచి మరింత మంది భక్తి తరలివెళ్లారు. వీరికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జంటుపల్లి వెంకట్, జిల్లా ఉపాధ్యక్షురాలు లలిత, ఉపాధ్యక్షుడు బాలి శివకుమార్, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ పలువురు సీనియర్ నాయకులు రామ భక్తులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయోధ్య రాముడి దర్శనార్థం 1350 మంది ప్రయాణికులతో ప్రత్యేక ఆస్తాలు రైలు బయలుదేరిందన్నారు. తాండూరు, వికారాబాద్, శేరిలింగంపల్లి తదితర ప్రాంతాలకు చెందిన రామభక్తులు వెళ్లారన్నారు. వీరంతా ఈనెల 27న అయోధ్యకు చేరుకుంటారని చెప్పారు. ఒక్కో ప్రయాణికుడు రూ.1850తో ముందస్తుగానే ట్రైన్ టికెట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

## డాగ్, బాంబు స్క్వాడ్ తనిఖీలు



లగేజీ బ్యాగ్‌ను పరిశీలిస్తున్న స్క్వాడ్ సిబ్బంది

**అనంతగిరి/తాండూరు టౌన్:** తాండూరు, వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం డాగ్ అండ్ బాంబు స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించింది. తాండూరు నుంచి వికారాబాద్, సికింద్రాబాద్ మీదుగా అయోధ్యకు వెళ్తున్న ప్రత్యేక ఆస్తా రైలు, ప్రయాణికుల లగేజీని డాగ్ అండ్ బాంబు స్క్వాడ్ బృందంతో పాటు రైల్వే, తాండూరు పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీడీ స్క్వాడ్ ఇన్‌చార్జి మాట్లాడుతూ.. ఎస్పీ కోటిరెడ్డి ఆదేశానుసారం అయోధ్యకు వెళ్తున్న ప్రత్యేక రైలులో తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రయాణికుల వద్ద లేదా రైళ్లలో అనుమానాస్పద వ్యక్తులు, లగేజీ కనపడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



చేవెళ్లలోని ఫరా కళాశాల గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లపై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

# కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

- చేవెళ్ల సభను విజయవంతం చేయాలి
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**చేవెళ్ల:** కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ప్రజలకు ఉందని ఐటీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. చేవెళ్లలో ఈనెల 27న రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పథకాల ప్రారంభం సందర్భంగా నిర్వహించే బహిరంగ సభపై ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చేవెళ్ల సెంటిమెంట్‌గా రెండు పథకాలకు ఇక్కడి నుంచి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. సత్తా చాటేలా సభ ఉండాలన్నారు. మహిళలకోసమే ప్రధానంగా అమలు చేస్తున్న పథకాలు కాబట్టి అన్ని నియోజకవర్గాల నుంచి మహిళలు, నియోజకవర్గాల ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని.. కష్టపడి పనిచేసే ప్రభుత్వమని పేర్కొన్నారు. చేవెళ్ల సభకు పెద్ద ఎత్తున జనసమీకరణ ఉండాలన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రశ్నించే హక్కులేదన్నారు. వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి మాట్లాడుతూ.. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చూపించాలన్నారు. సమావేశంలో పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి జ్యోత్స్న రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, శేరిలింగంపల్లి జగదీశ్‌గౌడ్, రాజేంద్రనగర్ నరేందర్, పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షుడు కిరణ్, సత్యం, నాయక్, సుధాకర్‌రెడ్డి, వసంతం, షాబాద్ దర్శన్, ఏడు నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**సభా ఏర్పాట్ల పరిశీలన**

చేవెళ్లలోని ఫరా కళాశాల గ్రౌండ్‌లో ఈనెల 27న జరగనున్న సభా ఏర్పాట్లను మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, కలెక్టర్ శశాంక, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. సభా నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పక్కగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. అన్నిశాఖల అధికారులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని కోరారు.

# గడువు మూడు రోజులే..

- ప్రభుత్వానికి లేవీ ఇవ్వడంలో మిల్లర్ల జాప్యం
- ఈ నెల 29లోగా ఇవ్వకుంటే ఫైన్
- వానాకాలం 35 శాతం, యాసంగి 90 శాతం బియ్యం మిల్లర్ల వద్దే
- ప్రభుత్వానికి ఫైన్‌తో సహా చెల్లించాల్సిన డబ్బు రూ.87.5కోట్లు



శనివారం సివిల్ సప్లై అధికారులు, మిల్లర్లతో సమావేశమైన అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

**వికారాబాద్:** మిల్లర్ల మాయాజాలం వారి మెడకే చుట్టుకుంటోంది. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇచ్చేందుకు ప్రభుత్వం ఇచ్చిన గడువు జనవరి 31తో ముగిసింది. మిల్లర్ల సంఘం అభ్యర్థన మేరకు మరోసారి గడువు పెంచి ఈ నెల 29లోగా మిల్లర్లు లేవీ బియ్యం సివిల్ సప్లై అధికారులకు అందజేయాలని ప్రభుత్వం తేల్చి చెప్పింది. గడువులోగా లేవీ బియ్యం ఇవ్వని పక్షంలో ప్రభుత్వానికి ఇవ్వాల్సిన లేవీతో పాటు 25 శాతం ఫెనాల్టీ చెల్లించాలి. గడువులోగా లేవీ ఇవ్వకుంటే ప్రభుత్వానికి మొత్తం బియ్యానికి బదులుగా డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇది వారి స్వయంకృతాపరాధమేనని అధికారులు పేర్కొంటున్నారు. వారికి 2022 ఏడాది వానాకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం బియ్యంగా మార్చేందుకు ఇవ్వగా వాటికి సంబంధించిన సీఎంఆర్ బియ్యం 15 రోజుల్లో ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. మిల్లర్లకు ధాన్యం కేటాయించి ఏడాది దాటినా నేటికీ ప్రభుత్వానికి అందజేయాల్సిన బియ్యం ఇవ్వలేదు. ఈ క్రమంలో అనేక సార్లు ప్రభుత్వం లేవీ ఇచ్చేందుకు గడువు పొడిగిస్తూ వచ్చింది. చివరగా ఇచ్చిన గడువు సైతం ఈ నెల 29తో ముగియనుంది. లేవీ సేకరణ విషయంలో కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పలుసార్లు మిల్లర్లతో సమావేశం నిర్వహించి హెచ్చరించినా వారిలో మార్పు రావటంలేదు.

**ఫైన్‌తో సహా చెల్లించాల్సిందే..**

పక్షం రోజుల్లో ప్రభుత్వానికి బియ్యం ఇవ్వాల్సిన మిల్లర్లు నిబంధనలు మరిచారు. ఏడాది గడిచినా సీఎంఆర్ ఇవ్వకపోవడంతో బియ్యానికి బదులుగా ఫైన్‌తో సహా డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి తలెత్తింది. 2022 వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద 95,095 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. వీటిని జిల్లాలోని 45 రైస్ మిల్లులకు కేటాయించింది. ఇచ్చిన ధాన్యంలో క్వింటాల్‌కు 67 కిలోల బియ్యం చొప్పున 67శాతం బియ్యం తిరిగి ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం 15 రోజుల్లో 63,714 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి మిల్లర్లు అందజేయాలి. ఇప్పటికీ కేవలం 43వేల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ప్రభుత్వానికి అందజేశారు. మిల్లర్లు మరో 20వేల మెట్రిక్ టన్నుల బియ్యం బకాయిపడ్డారు. గడువు మూడు రోజులే మిగిలిఉంది. మూడు రోజుల్లో లేవీ ఇవ్వకుంటే క్వింటాల్ బియ్యానికి రూ.3,500 చొప్పున 20వేల మెట్రిక్ టన్నుల బియ్యానికి రూ.70కోట్లు.. ఫెనాల్టీతో కలిపి రూ.87.5 కోట్లు ప్రభుత్వానికి డబ్బు చెల్లించాలి.

**ఇచ్చింది పదిశాతం లోపే..**

గతేడాది యాసంగికి సంబంధించిన 90శాతం బియ్యం మిల్లర్ల వద్దే ఉంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద 85,225 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. ఇందుకు 57,953 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు ప్రభుత్వానికి లేవీ రూపంలో ఇవ్వాల్సి ఉంది. కాగా ఇప్పటికీ కేవలం 4,192 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యం అందజేశారు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యం రూ.2,200 వరకు విక్రయిస్తూ.. బ్లాక్ మార్కెట్‌లో లభించే రేషన్ బియ్యం రూ.900 నుంచి రూ.1200 చొప్పున కొనుగోలు చేసి లేవీ రూపంలో ప్రభుత్వానికి అంటగడుతున్నారు. లేవీ బియ్యం క్వింటాల్ రూ.3,500 ఉండడంతో ప్రభుత్వానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మిల్లర్లు మాత్రం క్వింటాల్‌కు రూ.1500 నుంచి రూ.2వేల వరకు లాభం గడిస్తున్నారు. రూ.కోట్ల కుంబకోణం జరుగుతోందనే ఆరోపనలు వినిపిస్తున్నాయి.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత




సర్టిఫికెట్లతో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు

**విద్యావేత్త ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి**

**కడ్తాల్:** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రముఖ విద్యా వేత్త ప్రొఫెసర్ ఎన్. ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో, కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్– తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'లీడ్ ఎర్త్ లీడర్స్' శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో యువత, విద్యార్థులు ప్రధాన భూమిక పోషించాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. మన చుట్టూ ఉన్న గాలి, నీరు, భూమి కాలుష్యం కాకుండా చూడాలని, పర్యావరణహిత కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాల్సిన అవసరముందన్నారు. సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. శిక్షణ కార్యక్రమం పాఠశాలల్లో మంచి మార్పులకు భూమిక అవుతుందని ఆకాంక్షించారు. స్వచ్ఛ ప్రపంచం కోసం ఎర్త్ లీడర్స్ కృషి చేయాలని సూచించారు. వివిధ రంగాల నిపుణులు పర్యావరణ రక్షణ చర్యలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నారాయణపేట్ జిల్లాలకు చెందిన 130 మంది విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్స్ అందజేశారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నారాయణపేట్ జిల్లాలకు చెందిన డీఎస్ఓలు శ్రీనివాసులు, శ్రీనివాస్, భాను ప్రకాశ్, ఎస్ఈఆర్‌టీ నిపుణులు వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమేశ్‌రావు, సీజీఆర్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మారెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్తలు సాయిభాస్కర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, బాల చైతన్య కేంద్రాల నిర్వాహకుడు రజనీకాంత్, సీజీఆర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కారు బోల్తా

**ఐదుగురు విద్యార్థులకు గాయాలు**

**చేవెళ్ల:** స్థానికంగా ఉన్న ఓ కళాశాలకు చెందిన ఐదు మంది విద్యార్థులు కారులో అనంతగిరికి వెళ్తుండగా మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఐదుగురికి గాయలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తంగడపల్లి గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలంలోని ఓ కళాశాలకు చెందిన ఐదు మంది విద్యార్థినీలు కారులో అనంతగిరికి వెళ్దామని బయలు దేరారు. మార్గమధ్యలో తంగడపల్లి సమీపంలో రోడ్డు మూల మలుపు ఎక్కువగా ఉండటంతో కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థినీలకు స్వల్పగాయలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.



మలుపు వద్ద అదుపుతప్పిన కారు

# సేవాలాల్ మార్గం అనుసరణీయం



సేవాలాల్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కేటీఆర్ తదితరులు

**మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**ఆమనగల్లు:** గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ చూపినమార్గంలో అందరూ పయనించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఆమనగల్లు పట్టణ సమీపంలోని సేవాలాల్ గుట్ట వద్ద ఆదివారం సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. మాజీ మంత్రి కేటీఆర్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తదితరులు సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సంత్‌సేవాలాల్ ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. గిరిజనుల అభివృద్ధి కోసం సేవాలాల్ ఎంతో కృషి చేశారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కొనియాడారు. సేవాలాల్ జయంతిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు ఐచ్ఛిక సెలవు ఇచ్చిందని గుర్తుచేశారు. అంతకుముందు పట్టణంలో భారీ శోబాయాత్ర నిర్వహించారు. గిరిజనులు సాంప్రదాయ దుస్తుల్లో నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ, తలకొండపల్లి జెడ్పీటీసీ వెంకటేశ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### చిత్రలేఖనంలో గురుకుల విద్యార్థిని సత్తా

**రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన శ్రేయ**



**అనంతగిరి:** జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో చిత్రలేఖనం విభాగంలో వికారాబాద్‌లోని సంగం లక్ష్మీబాయి గురుకుల పాఠశాల విద్యార్థిని 9వ తరగతి విద్యార్థిని బి.శ్రేయ ద్వితీయ స్థానంలో నిలిచిందని జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని డీఈఓ రేణుకాదేవి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు అభినందించారు.

### ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

**తహసీల్దార్ రవీందర్ దత్**

**అబ్దుల్లాపూర్‌మెట్:** ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించబోమని మండల తహసీల్దార్ రవీందర్ దత్ హెచ్చరించారు. పెద్దఅంబర్‌పేట పరిధిలోని సర్వే నంబర్ 64లో గల ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం రెవెన్యూ సిబ్బందితో కలిసి జేసీబీల సహాయంతో తహసీల్దార్ కూల్చి వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొంతకాలంగా రెవెన్యూ అధికారులు బిజీగా ఉండడంతో అక్రమార్కులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారన్నారు. నిరుపేదలను, అమాయకులను ఆసరాగా చేసుకుని కబ్జాదారులు సదరు భూములను విక్రయిస్తున్నారన్నారు. పెద్దఅంబర్‌పేటలో 15 అక్రమ నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేసినట్లు ఆయన తెలిపారు.

### గిరిజన మోర్చా సోషల్ మీడియా కన్వీనర్‌గా రవి

**ఆమనగల్లు:** బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా ఆమనగల్లు మున్సిపల్ పరిధిలోని నుచ్చుగుట్టతండాకు చెందిన రవిరాథోడ్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డా.కళ్యాణ్‌నాయక్ నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా రవిరాథోడ్ మాట్లాడుతూ.. బీజేపీ పటిష్టతకు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

### ట్రాఫిక్ హోంగార్డుపై మహిళ దురుసు ప్రవర్తన

**కేసు నమోదు**

**బంజారాహిల్స్:** విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హోంగార్డుపై దురుసుగా ప్రవర్తించిన ఓ మహిళపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రోడ్డు నెంబర్–12లో ట్రాఫిక్ హోంగార్డు విఘ్నేష్ శనివారం రాత్రి డ్యూటీలో ఉన్నారు. రాత్రి 8.30 గంటల సమయంలో అగ్రసేన్ జంక్షన్ వద్ద జాగ్వార్ కారులో ఓ మహిళ రాంగ్‌రూట్‌లో వచ్చింది. ఇది గమనించి హోంగార్డు ఆమె కారును అడ్డగించాడు. దీంతో కారులో నుంచి దిగిన మహిళ ఒక్కసారిగా రెచ్చిపోయింది. హోంగార్డుపై బూతుల వర్షం కురిపించింది. అతనిపై చేయి చేసుకుంది. విధులను అడ్డగించడమే కాకుండా హోంగార్డు వేసుకున్న లైఫ్ జాకెట్‌ను చించివేసి..అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కొని కిందపడేసి ధ్వంసం చేసింది. నానా బూతులు తిడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించింది. ఈ సంఘటనపై విఘ్నేష్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మహిళపై 332, 353, 427, 504, 279, 184, 177 మోటార్ వెహికిల్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### విజయలక్ష్మి, నితిన్‌లకు పతకాలు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర స్థాయి 400 మీటర్ల చాంపియన్‌షిప్‌లో రంగారెడ్డి జిల్లా అథ్లెట్లకు రెండు పతకాలు లభించాయి. కొల్లూరులోని గాడియం స్పోర్టోపియా ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం జరిగిన ఈ ఈవెంట్‌లో మహిళల విభాగంలో నినావత్ విజయలక్ష్మి స్వర్ణ పతకం... పురుషుల విభాగంలో ఇస్లావత్ నితిన్ రజత పతకం సాధించారు. కొత్తపేటలోని శివాని డిగ్రీ కాలేజీలో బీకాం కంప్యూటర్స్ ఫస్టియర్ చదువుతోన్న విజయలక్ష్మి 400 మీటర్ల లక్ష్యాన్ని 1ని:05.00 సెకన్లలో చేరి విజేతగా నిలిచింది. ఇబ్రహీంపట్నం సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతోన్న నితిన్ 400 మీటర్ల లక్ష్యాన్ని 50.8 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచారు. కోచ్ వినోద్ కుమార్ వద్ద శిక్షణ పొందుతున్న విజయలక్ష్మి, నితిన్ ఈ ప్రదర్శనతో వచ్చే నెలలో త్రివేండ్రంలో జరిగే ఇండియా ఓపెన్ 400 మీటర్ల ఈవెంట్‌లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు.

## క్లుప్తంగా

### పర్యాటకుల ఆనందం



బోటింగ్ చేస్తున్న వారిని ఫొటోలు తీస్తున్న కటుంబసభ్యులు

**ధారూరు:** సెలవుదినం కావడంతో కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ముదురుతున్న ఎండలకు ఉపశమనంగా ఎక్కువ సమయం చెట్ల కింద సేదతీరడం, బోటింగ్ చేసి వెళ్తున్నారు. చిన్నారుల కేరింతలు, యువతీ, యువకులు సెల్ఫీలు, ఫొటోలకు ఫోజులిచ్చారు. ప్రాజెక్టు వద్దే వన భోజనాలు చేసి సాయంత్రం వరకు గడిపి వెళ్లిపోయారు.

### మార్మోగిన శివ నామస్మరణ

పార్వతీపరమేశ్వరుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

**మొయినాబాద్‌రూరల్:** ముత్యాల పందిరి, పచ్చని మామిడి తోరణాల అలంకరణతో పార్వతీపరమేశ్వరుల కల్యాణం వేదపండితులు కనుల పండువగా నిర్వహించారు. కనకమామిడి సంగమేశ్వరస్వామి ఆలయ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని జరిపించారు. అనంతరం స్వామి వారికి నూతన పట్టు వస్త్రాలు, పూలు సమర్పించి అక్షతలు, ఒడిబియ్యాలు పోశారు. దీంతో భక్తులు శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మారుమోగించారు. స్వామి వారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాల వితరణతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో నూతన దంపతులు కూర్చొని తిలకించారు. కనకమామిడి సంగమేశ్వర దేవాలయ ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది.

### నాణ్యమైన విద్యనందించాలి

ఇబ్రహీంపట్నం సీవిల్ కోర్టు జడ్జి యశ్వంత్‌సింగ్ చౌహాన్

**ఇబ్రహీంపట్నం రూరల్:** అందరికి నాణ్యమైన విద్యానందించాలని, పాఠశాలలు సామాజిక బాధ్యతతో నడిపించాలని ఇబ్రహీంపట్నం సివిల్ కోర్టు జడ్జి యశ్వంత్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని మౌంట్ లిటేరా జీ కిడ్జ్ స్కూల్ వార్షికోత్సం వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅథితులుగా జీలెర్న్ లిమిటెడ్ నేషనల్ హెడ్ కింగ్స్ స్టన్ డి సైజా ,ఇబ్రహీంపట్నం కోర్టు సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ చౌహాన్‌లు ముఖ్యఅథితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరింపజేశారు. సంస్కృతిక కార్యక్రమాలు, కరాటే విన్యాసాలు తల్లిదండ్రులను అందపరిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅథితులుగా విచ్చేసిన ఇబ్రహీంపట్నం సివిల్ కోర్టు జడ్జి యశ్వంత్ సింగ్ చౌహాన్‌లు మాట్లాడుతూ.. తమ కమారుడిని ఈ యొక్క పాఠశాలలో చేర్పించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. పాఠశాలలో విద్యాభోదన బాగుందన్నారు. ఇబ్రహీంపట్నంలో తొలి సీబీఎస్ఈ పాఠశాల ఇబ్రహీంపట్నం నడిబొడ్డున నిర్వహించడం బాగుందన్నారు. చదువుకునే రోజుల నుంచే చట్టాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తుప్పపట్టి.. యంత్రాలు మొరాయించి!

- నామమాత్రంగా నీటి శుద్ధి ప్రక్రియ
- శివారెడ్డిపేట్ ఫిల్టర్ బెడ్‌లో పాడైన మోటార్లు
- పట్టించుకోని అధికారులు



నామమాత్రంగా నీటి శుద్ధి చేస్తున్న యంత్రం



ఫిల్టర్ బెడ్ వద్ద తుప్ప పట్టిన మోటార్లు

**వికారాబాద్ అర్బన్:** వేసవికి ముందే పలు కాలనీల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. రానున్న మూడు నెలలు పట్టణ వాసులకు నీటి తిప్పలు తప్పేలా లేదు. ఇప్పటి నుంచే నీటి సరఫరాపై దృష్టి సారించకుంటే ఇబ్బందులు తప్పవని పట్టణవాసులు అంటున్నారు. ప్రజలకు తాగునీటి సరఫరా చేసే శివసాగర్ చెరువు నీరు పూర్తి స్థాయిలో శుద్ధి కావడం లేదు. దానిలో ఆలం వంటిది ఉపయోగిస్తూన్నా పెద్దగా ప్రయోజనం లేకుండా పోతుంది. ప్రస్తుతం వికారాబాద్ పట్టణంలోని 90శాతం వార్డులకు మిషన్ భగీరథ నీరే సరఫరా అవుతుంది. అప్పుడప్పుడు సాంకేతిక కారణాలతో, పైపులైన్ లీకేజీలతో నెల, రెండు నెలలకు ఒకసారి మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగిపోతుంది. ఇలాంటి సమయంలో పట్టణ ప్రజలకు శివసాగర్ నీరే ఆధారం. శివారెడ్డిపేట్ చెరువు నీటిని శుభ్రం చేసే ఫిల్టర్ బెడ్ పూర్తిగా తుప్పుపట్టింది. 30 ఏళ్ల క్రితం ఫిల్టర్ బెడ్‌లో నీటి శుద్ధికి ఏర్పాటు చేసిన యంత్రాలే ప్రస్తుతం ఉన్నాయి. నీటి శుద్ధి యంత్రాలు, నీటిని తోడే మోటార్లు తుప్పుపట్టి పాత సామగ్రిని తలపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం ప్రవేశపెట్టిన మున్సిపల్ బడ్జెట్‌లో నీటి శుద్ధి యంత్రాల మరమ్మతు ఊసెత్తక పోవడంపై పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**అనారోగ్యం బారిన ప్రజలు**

రెండు ఫిల్టర్ బెడ్లు ఉండగా ప్రస్తుతం ఒక ఫిల్టర్ బెడ్‌లోనే మోటార్లు కొంత పనిచేస్తున్నట్లు సమాచారం. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిన రోజు నామమాత్రంగా నీటి శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. శివారెడ్డిపేట్ నీళ్ల అత్యధిక మంది తాగునీటికి ఉపయోగించకపోయినా మురికివాడల ప్రజలు వాటినే తాగుతున్నారు. ఈ నీరు కూడా ఎక్కువగా స్లమ్ ఏరియాలకే సరఫరా అవుతుంది. అంతంత శుద్ధితో సరఫరా అయ్యే నీటిని తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుంటే అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. మరో ఫిల్టర్ బెడ్‌లోని మోటార్లు పూర్తిగా చెడిపోయి ఎక్కడ పడితే అక్కడ విద్యుత్ వైర్లు తేలి ఉన్నాయి. దీంతో అక్కడ పనిచేసే సిబ్బంది ఎప్పుడు ఎక్కడ ప్రమాదానికి గురవుతామోనని భయపడుతున్నారు. ఫిల్టర్ బెడ్‌తో మోటార్లు, నీటి శుద్ధి యంత్రాలు పనిచేయక పోయినా అధికారులు లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఆలం కొంటున్నారు. గత ఏడాది అధికారులు ఏకంగా రూ. 5లక్షలు వెచ్చించి ఆలం కొనుగోలు చేశారు. ఇప్పటికైనా అధికారులు నీటి శుద్ధి యంత్రాలను బాగుచేయించి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### రైలు కింద పడి యువకుడి మృతి

**షాద్‌నగర్‌రూరల్:** రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం షాద్‌నగర్ శివారులోని చటాన్‌పల్లి రైల్వే గేటు సమీపంలో వెలుగు చూసింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. సుమారు 25 ఏళ్లు ఉన్న ఓ గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు పసుపు రంగు టీషర్టు, లైట్ బ్లూ రంగు పాయింట్ ధరించి, నల్లటి గడ్డం ఉన్నట్లు గుర్తించారు. స్టేషన్ మాస్టర్ అభిదేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

### ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**షాద్‌నగర్‌రూరల్:** ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం ఉదయం షాద్‌నగర్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్‌కు చెందిన గూడూరు సుధాకర్ గత కొంత కాలంగా పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో ఉన్న కీర్తి అపార్టుమెంట్‌లో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. ఎవరు లేని సమయంలో గత రెండు రోజుల క్రితమే సుధాకర్ ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# క్రీడలతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**పూడూరు:** గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సాహించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి గ్రామంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రాకంచర్ల పెంటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దారుఢ్యానికి తోడ్పడుతాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ఉంటుందన్నారు. చిన్నప్పటి నుంచి పోటీతత్వాన్ని అలవర్చుకున్నప్పుడే అన్ని రంగాల్లో రాణించవచ్చన్నారు. క్రీడా పోటీలు స్నేహభావంతో ఆడాలని, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ పోటీల్లో మండల పరిధిలోనే కాకుండా వికారాబాద్ పరిగి ప్రాంతాల నుంచి 20 టీములు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, నాయకులు చెన్నయ్యగౌడ్, రవి, విఠలయ్య, రమేశ్‌కుమార్, అమర్‌నాథ్, రాములు, బాలయ్య, రాజు, శేఖర్, సురేష్, శ్రీనివాస్, గ్రామస్తులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన సెపక్‌తక్రా పోటీలు



మొదటి స్థానంలో నిలిచిన సబ్ జూనియర్ బాలుర జట్టు

**నల్లగొండ:** నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో జూనియర్, సబ్ జూనియర్ అంతర్ జిల్లా సెపక్‌తక్రా చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన పోటీల ముగింపు కార్యక్రమంలో తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.డి.మక్బూల్ అహ్మద్ పాల్గొని మాట్లాడారు. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ఎస్ఆర్ ప్రేమ్ రాజ్, పెరిక సురేష్ పాల్గొన్నారు.

**ప్రతిభ చూపిన జట్ల వివరాలు**

జూనియర్ బాలుర విభాగంలో రంగారెడ్డి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్ జట్టు ద్వితీయ స్థానం, హైదరాబాద్-నిజామాబాద్ జట్లు సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. రంగారెడ్డి జట్టుకు 3 బంగారు పతకాలు, నిజామాబాద్‌కు ఒక బంగారు పతకం, ఒక రజతం, ఒక కాంస్యం లభించింది. నల్లగొండ జట్టు ఒక రజతం, ఒక కాంస్యం సాధించింది. హైదరాబాద్, వరంగల్ జట్లు చెరో రెండు కాంస్య పతకాలను సాధించగా, మహబూబ్‌నగర్ ఒక రజత పతకాన్ని కైవసం చేసుకుంది.

# కల్యాణం.. కమనీయం



బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు



దేవాలయం ముందు ఏర్పాటు చేసిన హోమగుండం

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో హోమగుండం

**ధారూరు:** మండల పరిధిలోని శేరిగడ్డతండాలో కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారికి పెద్దలు, శివస్వాములు కల్యాణం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన హోమ గుండం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. పీసీఎంతండా, శేరిగడ్డతండా, జీడిగడ్డతండా, గురుదోట్ల గ్రామాల భక్తులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేసి తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. మహిళలు బోనాలతో ఊరేగించి, దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పెద్దలు పుల్యానాయక్, సుధాకర్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వంతెన.. అంతేనా!

విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు



బూర్గుపల్లి వెళ్లే రోడ్డులో అండర్ బ్రిడ్జి కింద ఉన్న నీరు

**వికారాబాద్ అర్బన్:** మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా పనులపై పట్టణానికి రావాలన్నా తిరిగి పోవాలన్నా రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిని దాటాలి. బ్రిడ్జిల కింద నుంచి పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తుండటం, రాత్రివేళ చీకటిగా ఉండటంతో ప్రమాదాలకు దారి తీస్తోంది. మున్సిపల్ పరిధిలోని గెరిగెట్‌పల్లికి పోవాలంటే అండర్ బ్రిడ్జి దాటాలి. ఇక్కడ ఎప్పుడూ వాగు నీరుతో పాటు, మున్సిపల్ డ్రైనేజీ నీరు కూడా ప్రవహిస్తుంది. దీంతో రాత్రిపూట అక్కడి గ్రామాలకు వెళ్లే ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో కొంత సీసీ రోడ్డు నిర్మించారు. దీంతో రాకపోకలకు కొంత ఇబ్బందులు తగ్గాయి. కానీ ఇక్కడ చీకటిగా ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం 6 గంటల తరువాత రైతులు గ్రామాల నుంచి పట్టణానికి వస్తుంటారు. చీకటిగా ఉండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. బూర్గుపల్లి అండర్ బ్రిడ్జి వద్ద కూడా మరమ్మతులు చేయించి విద్యుత్ లైట్లు వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

### డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయండి

**యాచారం:** డీఎస్సీ-2008 అభ్యర్థులకు న్యాయం చేసేలా కృషి చేయాలని, మెరిట్‌లో సెలెక్ట్ అయిన అభ్యర్థులు ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే ఉద్యోగవకాశాలు కల్పించాలని రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఉత్తర్వులు కూడా ఇచ్చిందని అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2008 అభ్యర్థులకు న్యాయం చేసిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగాలు వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జంగయ్య, మహేందర్, రవి తదితరులు ఉన్నారు.

### ఫార్మాసిటీపై స్పష్టమైన ప్రకటన చేయాలి

**యాచారం:** ఫార్మాసిటీపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సేకరించిన భూములను రైతులకు తిరిగి ఇచ్చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని, రైతులకు తిరిగి ఆ భూములు ఇచ్చేస్తామని కాంగ్రెస్ పెద్దలు ఎన్నికల ప్రచారంలో ప్రజలకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. కానీ, ప్రస్తుతం ఒకసారి ఫార్మాసిటీ రద్దు అని, మరోమారు ఫార్మాసిటీ ఉంటుందనే ప్రకటనలతో రైతుల్లో అయోమయం నెలకొందని ఆరోపించారు.

# పేద కుటుంబానికి.. పెద్ద ఆపద

- కుమారుడి రెండు కిడ్నీలు ఫెయిల్యూర్
- చికిత్సకు రూ.12 లక్షల ఖర్చు
- ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు



ఆస్పత్రిలో దీనస్థితిలో రాజేందర్‌రెడ్డి

**బంట్వారం:** రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం వాళ్లది. కుమారుడి కిడ్నీ ఫెయిల్యూర్ ఆ తల్లిదండ్రులకు అంతులేని విషాదాన్ని నింపింది. రూ.లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించే స్తోమతలేక దిక్కుతోచని స్థితిలో కుటుంబం రోదిస్తోంది. ఇదీ మండల పరిధిలోని సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన నారాయణరెడ్డి లలితమ్మ దంపతుల పరిస్థితి. వీరు వ్యవసాయ కూలీలు. వారికి రాజేందర్‌రెడ్డి (26) కుమారుడు ఉన్నారు. ఆయన ఇంటర్ వరకు చదువుకుని ఆపేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాలేకపోవడంతో తాండూరులోని ఓ మొబైల్ షాపులో పని చేస్తుండేవారు. రాజేందర్‌రెడ్డి ఏడాదిన్న కిందట అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. రెండు కిడ్నీలు ఫెయిల్యూర్ అయినట్లు అప్పట్లో డాక్టర్లు నిర్ధారించారు. చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా రూ.12 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో చేతిలో చిల్లి గవ్వ లేని తల్లిదండ్రులు ఇంట్లోనే కుమారుడిని చూసి విలపించారు. ఇటీవల ఆరోగ్యం మరింతగా విషమించడంతో ఓ ఆస్పత్రిలో చేర్పించారు. రూ.లక్షకు పైగా అప్పు చేసి ఖర్చు పెట్టారు. ప్రస్తుతం చేతిలో చిల్లి గవ్వ లేక దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఎవరైనా ఆపన్న హస్తం అందించి తమ కుమారుడిని కాపాడాలంటూ వేడుకుంటున్నారు. 9160472271, 8186861514 నంబర్లకు సాయం కోరుతున్నారు.

# తాగునీటి సరఫరాపై ఫోకస్

- ఎండల తీవ్రతతో ప్రత్యామ్నాయంపై దృష్టి
- బోరుబావుల ద్వారా అందించేందుకు అధికారుల ఏర్పాట్లు
- మరమ్మతులు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశం



అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

**వేసవికి ముందే ఎండలు మండుతున్నాయి. ఈ తరుణంలో ప్రజల దాహార్తికి విఘాతం కలగకుండా అధికారులు చర్యలు ప్రారంభించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం తలెత్తితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సిబ్బంది దృష్టి సారిస్తోంది.**



**యాచారం:** ఎండల తీవ్రత దృష్ట్యా మిషన్ భగీరథ సరఫరాలో ఇబ్బందులొస్తే ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. గతేడాది సమృద్ధిగా వర్షాలు లేకపోవడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో గణనీయంగా నీళ్లు తగ్గాయి. ఈ నేపథ్యంలో వేసవి కాలం ఎండల తీవ్రతకు నీటి సరఫరాలో అంతరాయం వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజల దాహార్తి తీర్చే విధంగా అధికారులు కృషి చేస్తున్నారు. గత ఐదేళ్లుగా మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు లేకపోవడంతో ప్రజలకు నీటి ఎద్దడి ఉత్పన్నం కాలేదు. కానీ భవిష్యత్తులో భగీరథ నీటి సరఫరాలో సమస్యలొచ్చే అవకాశం ఉంటుందని అధికార యంత్రాంగం అలర్ట్ అయింది. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని యాచారం, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని దాదాపు 125 గ్రామాలతో పాటు ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో నిత్యం మిషన్ భగీరథ నీళ్ల సరఫరా అవుతున్నాయి. డివిజన్‌కు మొత్తంగా రోజుకు దాదాపు నాలుగున్నర కోట్ల లీటర్ల మిషన్ భగీరథ నీళ్ల సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతానికి కూడా డివిజన్ ప్రజల దాహార్తిని మిషన్ భగీరథ నీళ్లతోనే తీరుస్తున్నారు.

**430 బోరుబావులు**

ఐదేళ్లుగా వృథాగా ఉన్న బోరుబావులకు మరమ్మతులు చేసి వాడుకలోకి తెచ్చే విధంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. డివిజన్‌లోని ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని గ్రామాల్లో ప్రస్తుతం వృథాగా ఉన్న బోరుబావులెన్ని, బోరుబావుల్లో నీళ్లున్నవి ఎన్ని, మరమ్మతులు చేస్తే నీళ్లు వచ్చేవి ఎన్ని అనే అంశాలపై గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు సర్వే చేశారు. డివిజన్‌లోని పలు గ్రామాల్లో 430కి పైగా బోరుబావులున్నట్లు అధికారులు గుర్తించి, వాటి మరమ్మతులపై దృష్టి పెట్టారు. ఇన్నాళ్లు వృథాగా ఉండడంతో మోటార్లు, పైపులు, విద్యుత్ వైర్లు మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. కొద్ది రోజుల కిందనే జిల్లా కలెక్టర్ శశాంక మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులొస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ప్రజల దాహార్తి తీర్చాలని అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత ఇలానే ఉంటే యాచారం, ఇబ్రహీంపట్నం, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని అనేక గ్రామాల్లో నీటి ఇబ్బందులు తలెత్తె అవకాశం ఉంది.

# పనికి వచ్చి.. అనంత లోకాలకు చేరి

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్
- ఒకరి దుర్మరణం, మరొకరికి తీవ్రగాయాలు



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై గోపాల కృష్ణ

**నందిగామ:** బైక్‌ను నిర్లక్ష్యంగా నడపడంతో ఓ నిండు ప్రాణం గాల్లో కలిసింది. అతివేగంతో పాటు అజాగ్రత్తగా ద్విచక్రవాహనాన్ని నడపడంతో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని నర్సప్పగూడ శివారులో తిమ్మాపూర్-చేగూరు రోడ్డులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై గోపాల కృష్ణ కథనం ప్రకారం.. నేపాల్ దేశానికి చెందిన రాంబహదూర్(45), రాంకమ్మీ మరికొంత మంది కన్హా ఆశ్రమంలో ప్లంబర్ పనిచేసేందుకు రెండు రోజుల క్రితం వచ్చారు. ఉదయం టీ తాగేందుకు ఇద్దరూ తిమ్మాపూర్‌కు బుల్లెట్ బండిపై వెళ్తున్నారు. ఈ క్రమంలో రాంబహదూర్ వాహనాన్ని అతివేగంగా నడపడంతో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాంబహదూర్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, రాంకమ్మీకి తీవ్ర గాయాలయాయి. దీంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడి కుమారుడు రాంజార్జీమగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# కాంగ్రెస్‌తోనే గ్రామాలాభివృద్ధి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నంరూరల్:** కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పోల్కంపల్లి పీఏసీఎస్ చైర్మన్ చిన్నగంట రాజశేఖర్ రెడ్డితో పాటు ఇద్దరు డైరెక్టర్లు ఆదివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 27 నుంచి రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వనున్నామన్నారు. గత ప్రభుత్వాల కంటే ప్రస్తుత ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, నాయకులు కొత్తకుర్మ మంగమ్మశివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, యాదయ్య, లక్ష్మణ్‌రావు, రవి, అశోక్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

**మహామ్మాయిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

మంగళ్‌పల్లి మహామ్మాయి దేవి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగారెడ్డి, గురునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌ముదిరాజ్, రమేశ్, అశోక్‌గౌడ్, ఉమర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.